క్లుప్తంగా

సంప్రదాయాలకు గౌరవం



ఆశీర్వచనం తీసుకుంటున్న పుట్ట మధు

మంథని: ఉమ్మడి రాష్ట్రంలో సంప్రదాయాలకు సరైన గుర్తింపు లేదని, స్వరాష్ట్రంలో గౌరవం దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు అన్నారు. సోమవారం ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో భూలక్ష్మీ సమేత బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గతంలో దసరా పండుగకు మాత్రమే ఆడబిడ్డలు వచ్చేవారని, కానీ బొడ్రాయి వేడుకలకు ఊరంతా ఒక్కటై పండుగలా జరుపుకుంటున్నారని తెలిపారు. గ్రామ దేవతల దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా,పాడిపంటలతో సంతోషంగా ఉండాలన్నారు.

మద్దెల కుటుంబానికి మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు మద్దెల రవీందర్, మాజీ సర్పంచ్ మద్దెల నర్సయ్య తల్లి శాంతమ్మ మృతిచెందగా మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా శాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి వెంట సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పూస్కూరి రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, సర్పంచు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం



పూజలు చేస్తున్న మాజీ సర్పంచులు

సుల్తానాబాద్: మండలకేంద్రంలోని శివాలయంలో మాజీ సర్పంచులు అంతటి అన్నయ్యగౌడ్, పుష్పలత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకంతోపాటు వస్త్రాలను పలువురు భక్తులు అందించారు. ఏరువాక సందర్భంగా రైతులకు పాడి, పంటలు అధికంగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు. హాజరైన భక్తులకు అర్చకులు రమేశ్, మహేశ్ తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సత్యనారాయణ శివాలయ భక్త బృందం సామల హరికృష్ణ, అల్లంకి అశోక్, రమేశ్, దిలీప్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ జీపీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమలమ్మ నేతృత్వంలో ఐదుగురు గర్భిణులకు సామూహిక సీమంతం చేసి చీరె, సారె, పూలు, పండ్లు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాదరవేణి స్వామి, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం.గంద్ర రవీందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్యాం, కారోబార్ పీతాంబర్, అంగన్‌వాడీ టీచర్లు భారతి, గాయత్రి, కవితారాణి, ఆశ వర్కర్లు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ప్రజాపంథా దీక్షా దివస్ నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) సభ్యులు

రామగుండం: అంతర్గాం మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో దీక్ష దివాస్ పేరుతో నిరసన చేపట్టారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేష్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాచేస్తూ ఆడంబరాలు చేపట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకులు తోకల రమేష్, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, కోడిపుంజుల లక్ష్మి, తీగుట్ల రాములు, మార్త రాధ, తూళ్ల శంకర్, ఆలకుంట ఎల్లయ్య, దేవన్న,ఓదెలు, రాయమల్లు, బత్తుల రాజయ్య కల్పన, పోచయ్య, శ్రీనివాస్, దేవేందర్ తదితరులున్నారు.

భూసార పరీక్షలపై పట్టింపేది?

- రసాయనాల సరఫరా లేక మూలన పడిన టెస్ట్ కిట్లు
- తగ్గిన సేంద్రియ ఎరువుల వాడకం
- దిగుబడి లేక రైతన్న దిగాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- టెస్ట్ కిట్లు అందించాలని వేడుకోలు

ధర్మారం: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి, అధిక లాభం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. కానీ రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు అందుబాటులో లేక, ఉన్నా పట్టించుకోకపోవడంతో అన్నదాతలు మూస పద్ధతిలో పంటలు సాగుచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా సాగుచేసిన పంటలో తక్కువ దిగుబడి రావడంతో పాటు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కానరాక రైతులు అప్పుల పాలవుతున్నారు.



ధర్మారంలోని వ్యవసాయ కార్యాలయం

ధర్మారం మండలంలో మూడేళ్లుగా భూసార పరీక్షలు చేయడం లేదు. రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి క్లస్టర్ పరిధిలో ప్రభుత్వం భూసార పరీక్ష కిట్లు అందించినప్పటికీ కెమికల్స్ సరఫరా చేయకపోవడంతో పరీక్షలు నిర్వహించడం లేదు దీంతో రైతులు మూస పద్ధతిలోనే పంటలు సాగుచేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగుచేస్తే పంటలు చీడపీడల బారినపడి దిగుబడులు తగ్గుతున్నాయి. కనీసం పంటల సాగు, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించే అధికారులు లేకుండాపోయారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించడంలో సిబ్బంది విఫలమవుతున్నారు.

పరీక్షలు చేసే వారేరి...

వ్యవసాయం దండుగ కాదు పండుగ చేస్తాం. అని చెప్పిన పాలకులు, అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కాగా మూసపద్ధతి సాగుకు స్వస్తి చెప్పి ఆధునిక వ్యవసాయం వైపు రైతులను మళ్లించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి 2018లో 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా లెక్కించి మండలంలో 6 క్లస్టర్‌లు ఏర్పాటుచేసింది. మండలంలోని కటికెనపల్లి, మల్లాపూర్, ధర్మారం, నందిమేడారం, బొట్లవనపర్తి, దొంగతుర్తి గ్రామాలను క్లస్టర్ గ్రామాలుగా ఏర్పాటుచేసి రైతువేదికలను సైతం నిర్మించింది. ఒక్కోక్లస్టర్‌కు ఒక ఏఈవోను నియమించింది. భూసార పరీక్షలు చేసేందుకు వీరికి కిట్లు కూడా అందించింది. వీటితో ప్రధాన పోషక విలువలు, నత్రజని, భాస్వరం, పోటాష్ నేల సామర్థ్యం పరీక్షలు నిర్వహించేందుకు కెమికల్స్‌తో పాటు జల్లెడ ఇతర పరికరాలు అందించింది. రెండేళ్లు ప్రభుత్వం పరీక్షల నిర్వాహణకు కెమికల్స్ సరఫరా చేసింది. 2021 నుంచి కెమికల్స్ సరఫరా చేయడం లేదు. దీంతో ఏఈవోలు పరీక్షలు చేయకుండా కిట్లను మూలన పడేశారు.

మూస పద్ధతిలో సాగు..

భూసార పరీక్షలు చేయకపోవటంతో భూమిలోని పోషక విలువలు, పీహెచ్‌సీ, ఈసీ విలువలు తెలియడం లేదు. దీంతో ఏ పంట వేయాలో ఎ పంటి వేస్తే ఎంత మోతాదులో ఎరువులు వేయాలో తెలియక రైతులు ఇష్టారాజ్యంగా ఎరువులు, పురుగుల మందులు వేస్తున్నారు. దీంతో భూమిలోని పోషకాలు లేకుండా పోయి పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. మండలంలో రైతులు ముఖ్యంగా వరి పంటలను సాగుచేస్తారు. దిగుబడులు అధికంగా రావాలనే ఉద్దేశ్యంతో అధిక ఎరువులను వాడుతున్నారు. పంట మార్పిడి విధానం సైతం చేయకపోవటంతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయి. భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంటలు సాగుచేయాలో తగు సూచనలు సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పరీక్షలు చేయటం లేదు



రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి క్లస్టర్‌కు భూసార పరీక్ష కిట్లను అందించింది. రెండేళ్లు భూసార పరీక్షలు చేశాం. తర్వాత రెండేళ్లకు భూసార పరీక్షలకు అవసరమైన కిట్లకు ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. దీంతో పరీక్షలు చేస్తలేము. ప్రతీ గ్రామంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

– పూర్ణిమ, ఏవో ధర్మారం

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

జ్యోతినగర్/ధర్మారం/రామగుండం: నిరంతరం మొక్కలు నాటుదాం... నాటిన మొక్కలను సంరక్షించుదాం.భావితరాల అభ్యున్నతికి పాటుపడదామంటూ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సీహెచ్.నర్సయ్య పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య ఆదేశాలతో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల సందర్భంగా అటవీశాఖ అధికారులు కుందనపల్లి సమీపంలోని అటవీశాఖ ఉద్యానవనంలో 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అనంతరం ఫారెస్టు అధికారుల బృందం ఎన్టీపీసీ, గోదావరిఖని మీదుగా ర్యాలీతీశారు.ఎన్టీపీసీ జ్యోతినగర్ అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్‌లో పర్యావరణంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో నేషనల్ యూత్ ప్రాజెక్ట్ రాష్ట్ర అధ్యక్షుడు కే.యాదవరాజు పాల్గొని వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాలన్నారు. ధర్మారం మండలం నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యాధికారి నార్ల అనుదీప్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సయ్యద్ రహ్మతుల్లా, ఎండీ.హసన్‌ఖాన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్, బీట్ ఆఫీసర్లు మిర్జా ఇర్షద్ బేగ్, రమేశ్‌కుమార్, ట్రస్మా రాష్ట్ర సెక్రటరీ జనరల్ అరకాల రామచంద్రారెడ్డి, రామగుండం కార్పొరేషన్ ట్రస్మా అధ్యక్షుడు, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ యాదగిరి గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం తిరుపతి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యులు గౌతం, సుస్మిత, అమర్నాథ్, సూపర్‌వైజర్లు జయ, జీవరాణి, హెల్త్‌అసిస్టెంట్ దామోదర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



అర్బన్‌పార్కులో అటవీశాఖ అధికారులు



మొక్కలతో వైద్య సిబ్బంది



పూలమొక్క అందుకుంటున్న యాదవరాజు

బల్దియాలో సివిల్ కాంట్రాక్టర్ల ధర్నా

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్
- బల్దియా ఎదుట బైఠాయించి ఆందోళన
- ముఖద్వారం వద్ద భోజనాలు చేసి నిరసన
- చేపట్టిన పనులను నిలివేస్తున్నట్లు వెల్లడించిన కాంట్రాక్టర్లు



బల్దియా ముందు ధర్నా, నిరసన తెలియజేస్తున్న సివిల్ కాంట్రాక్టర్లు

కోల్‌సిటీ: చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా అధికారులు మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, రామగుండం నగరపాలక సంస్థలోని సివిల్ కాంట్రాక్టర్లు నిరసన బాటపట్టారు. సోమవారం బల్దియా కార్యాలయం ఎదుట మెట్లపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఆందోళన చేశారు. మధ్యాహ్నం అక్కడే మెట్లపై కూర్చొని భోజనం చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. సాయంత్రం వరకూ కూడా పాలకవర్గం, అధికారులు స్పందించకపోవడంతో ముఖద్వారం ఎదుట తివాచీలు పరిచి నిద్రించి నిరసన తెలిపారు. మంగళవారం నుంచి చేపట్టే అభివృద్ధి పనులను నిలిపివేస్తున్నట్లు కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 2021లో చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు రెండేళ్ల క్రితం హరితహారం కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులకు, కార్పొరేషన్‌లో చేసిన అత్యవసర పనుల బిల్లులు ఇప్పటి వరకు చెల్లించకుండా కాంట్రాక్టర్లను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లు చేసిన పనులపై సంబంధిత అధికారులు పరిశీలించి బిల్లుల చెల్లింపులకు అన్ని ప్రక్రియలు పూర్తి చేసినప్పటికీ, ఇప్పటి వరకు కూడా వాటిని మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోవిధులు నిర్వహించిన అధికారుల హాయాంలో చేసిన అభివృద్ధి పనులకు, బిల్లులు చెల్లించమని పొంతనలేని సమాధానాలు చెబుతూ మానసింగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఇదే సమస్యపై ఏడాది క్రితం కాంట్రార్లు ధర్నా నిర్వహించారని, సమస్యను పరిష్కరిస్తామని మేయర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించామని, ఇప్పటికీ మేయర్ హామీ నెరవేర్చలేదన్నారు. పాలకవర్గం, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, ఇప్పటికే టెండర్ల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు స్పందించే వరకు బల్దియా ముఖద్వారం వద్దే రాత్రింబవళ్లు ధర్నా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈక్రమంలో ధర్నాచేస్తున్న కాంట్రాక్టర్ల వద్దకు మేయర్ వెళ్లి మంగళవారం సమస్యను పరిష్కరిస్తానని హామీతో తాత్కాళికంగా ధర్నా విరమించారు. ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లకు కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు నగునూరి రాజు తదితరులు సంఘీభావం తెలిపారు. కాంట్రాక్టర్లకు సుమారు రూ.4కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించడానికి మేయర్, కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కాంట్రాక్టర్లు ఎస్.సదానందం, ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, రజినీకాంత్, కృపాకర్‌రావు, కోడూరి రమేశ్, ఎం.నవీన్, తిరుపతి, గంగరాజు, దుర్గాప్రసాద్, రాఘవరెడ్డి, కత్తెరమల్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో బాహాబాహీ

గోదావరిఖని: భూవివాదంలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగిన ఘటన గోదావరిఖని అడ్డగుంటపల్లిలో జరిగింది. ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య మొదలైన వివాదం కొట్టుకునేవరకూ వెళ్లింది. గొడవ పెరిగి ఘర్షణకు దారితీయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వెళ్లి గొడవకు దిగిన వారి సెల్‌ఫోన్లు తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్ పిలిపించి విచారణ చేపట్టారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల, ఇందుర్తి, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీచేశారు. అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోనికూనారం గ్రామం జగదాంబ ఆలయంలో సోమవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండ్ల రసాలతో, పంచామృతాలతో భక్తులు అభిషేకాలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. వేద పండితులు నిట్టూరి అంబరీష్ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డొంకెన విజయ, ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, ఆలయ కమిటీ చైర్మన్ నారగోని లక్ష్మణ్, రిటైర్డ్ హెచ్ఎం దండ నరసింహారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేమారెడ్డి, మాజీ ఎంపీటీసీ డొంకెన మొగిలి, నాయకులు కొట్టె సమ్మయ్య, రవీందర్, సదయ్యగౌడ్, ఆంజనేయులు, వివిధ గ్రామాల భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మంథని: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు డీజేలతో హంగామా సృష్టించారని, చెప్పులు వేసుకుని అంబేద్కర్ విగ్రహం మెట్లు ఎక్కిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభికం చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడమే కాకుండా అంబేద్కర్‌ను అవమానపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేశ్, ఆర్ల సందీప్, లింగయ్య, రాజు, తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎఫ్ కన్వీనర్‌గా శ్రీకాంత్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఏరియా ఎమ్మార్పీఎఫ్ కన్వీనర్‌గా బూడిద శ్రీకాంత్, కో–కన్వీనర్‌గా కంబాల తిరుపతిని నియమిస్తున్నట్లు రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్ తెలిపారు. సోమవారం యైటింక్లయిన్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. అనంతరం నియామక పత్రాలు అందించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తిరుపతి, రాజయ్య, వంశీ, రోషన్‌తదితరులు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం



అభినందన పత్రం అందిస్తున్న ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తుల సింగరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు కరీంనగర్ ఏసీపీ శ్రీనివాస్ అభినందనపత్రం అందించారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రమేశ్, భీష్మాచారి, చంద్రమౌళి మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ పేపర్స్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆవిర్భావం



న్యూస్ పేపర్స్ ఏజెంట్స్ అసోసిషన్ ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో కొత్తగా న్యూస్ పేపర్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. స్థానిక విఠల్‌నగర్‌లో సోమవారం ఏజెంట్లు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం నూతనకమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పంజా అశోక్, ఉపాధ్యక్షుడిగా పుట్ట నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వీరమల్లు విజేందర్‌రెడ్డి సహాయ కార్యదర్శిగా కాల్వ మధుసూధన్, కోశాధికారిగా చిలువేరి సదానందం, కార్యనిర్వహక సభ్యులుగా కాల్వ కుమారస్వామి, గోపాల శ్రీనివాస్ మరో 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

వాటర్‌ఫ్రీజర్ అందజేత



వాటర్ రిఫ్రిజిరేటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకాల్వల లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2004–2007లో డిగ్రీ చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం వాటర్ ఫ్రీజర్‌ను అందించారు. విద్యార్థులకు చల్లనీ నీరు అందించేందుకు వాటర్‌ఫ్రీజర్‌ను కళాశాలలో ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య వాటర్‌ఫ్రీజర్‌ను ప్రారంభించి అభినందించారు. కార్యక్రమంలో నితీన్,సంజీవ్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులున్నారు.

ఘనంగా బీరన్న పట్నాలు



ఆలయం ముందు వేసిన బీరన్న పట్నాలు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బీరప్ప, కమరావతి, మాంకాళమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీర్ల పూజారులు బీరన్న పట్నాలు వేశారు. బీరన్న ఒగ్గు కథను సభ్యులకు చెప్పారు. సంఘంసభ్యులు కుటుంబాలతో హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. అధ్యక్షుడు అట్ల సంతోష్, తువ్వ కనుకయ్య, సతీశ్, వెల్పుల లింగయ్య, అట్ల మల్లేశం, దాడి రవి, కొమ్ము జోగయ్య, వెల్పుల గట్టయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక 29వ డివిజన్ సూర్యనగర్‌లో ప్రగతిబాట నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రామగుండం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. డివిజన్‌లో రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో జాలీ రాజమణి, నూనే లతా మోహన్, వంగ శ్రీనివాస్‌గౌడ్, శరత్‌కుమార్, బాబురావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోలేటి జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్/రామగుండం/యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం కేక్ కట్‌చేసి పేదలకు స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీచేశారు. రామగుండం పట్టణంలోని తబితా ఆశ్రమంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టి అన్నదానం చేశారు. అంతర్గాం మండల కేంద్రంలో కేపీ రాజు ఆధ్వర్యంలో వందమంది మహిళలకు చీరలు పంచిపెట్టారు. కోలేటి యువసేన ఆధ్వర్యంలో యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తాలో 500 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పరామర్శ

పాలకుర్తి: మేడిపల్లి సింగిల్‌విండో చైర్మన్ మామిడాల ప్రభాకర్ తండ్రి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆర్టీసీ మాజీ చైర్మన్, బీజేపీ నాయకుడు సోమారపు సత్యనారాయణ పరామర్శించారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.